

ఆశలన్నీ గృహలక్ష్మి పైనే..!

రాష్ట్రప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టి.. గ్రామం మొదలు పట్టణాల్లోని అర్హుల నుంచి ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది.

8లో▸



ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రేపు మాక్‌డ్రిల్

ఫర్టిలైజర్‌సిటీ: కర్మాగారంలో శనివారం మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు తెలిపారు. ఎమర్జెన్సీ సైరన్ మోగిస్తారన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మద్యంషాపుల టెండర్లకు నేడే చివరి గడువు



దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని 77 మద్యం దుకాణాలకు కొత్త లైసెన్సుల జారీకి దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగుస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈనెల 21న ఉదయం 11 గంటలకు బందంపల్లిలోని స్వరూపగార్డెన్‌లో లాటరీ పద్ధతిన మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుందని వివరించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళా ఆరోగ్యానికి రుతుప్రేమ

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్యానికి రుతుప్రేమ కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు నిర్వహించిన రుతుప్రేమ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. శానిటరీ ప్యాడ్లు చెత్తలో, డ్రైనేజీల్లో పడేయడం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, కృపాబాయి, ట్రైనర్లు మహేశ్, మాలినివరిమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

19న 5కె రన్

ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యం పెంచేందుకు ఈనెల 19న 5కే రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 6 గంటలకు జూనియర్ కళాశాల నుంచి రన్ మొదలవుతుందన్నారు. అమర్‌నగర్, మసీద్ చౌరస్తా, జెండా చౌరస్తా, సుభాష్ విగ్రహం, కమాన్ మీదుగా తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

బల్దియా అభివృద్ధికి రూ.50కోట్లు

కోల్‌సిటీ(రామగుండం):రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.50 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ సెక్రెటరీ సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులపై ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించాల్సి ఉంది. డివిజన్ల చొప్పున నిధులను కేటాయిస్తారా..? ప్యాకేజీ కింద పనులను ప్రతిపాదిస్తారా..? అనేదానిపై సమీక్ష నిర్వహించనున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్న మక్కాన్ సింగ్

గోదావరిఖని: పేదలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. గురువారం స్థానిక గంగానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో అధికారంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. మైనారిటీ నాయకులు జుబేర్ అధ్వర్యంలో స్వామి రాజా, జియా, ఆదిల్, సైద్ ఇమ్రాన్, తాజ్, అరుణ్, కాలీమ్, షేక్ హాజీ, శివ, ఫయాజ్, అలీ, షఫీ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ నజీం, కార్పొరేషన్ అధ్యక్షుడు కౌటం సతీశ్, పార్టీ 8వ డివిజన్ ప్రెసిడెంట్ సత్య ప్రసాద్, మైనారిటీ నాయకులు ఆరిఫ్ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అందుబాటులో ఆధునిక వైద్యం

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు ఆధునిక వైద్యాన్ని అందుబాటులో ఉంచుతామని డైరెక్టర్(పా) ఎన్.బలరాం అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రూ.25 లక్షలతో బయోకెమిస్ట్రీ అనాలసిస్, మైక్రో బయాలజీ, రక్త శుద్ధి కంప్యూటర్ ఆధునిక వైద్య పరీక్షల యంత్రాలను ప్రారంభించారు. రూ.రెండు కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రానికి భూమిపూజ చేశారు. సింగరేణిలో మోకాలి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, సేఫ్టీ జీఎం సాంబయ్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సీఎంఓ కిరణ్‌రాజు పాల్గొన్నారు.

2021 నవంబర్‌లో పెద్దపల్లిలోని రంగాపూర్ ఇటుక బట్టీల్లో మేజర్ వలస కూలీపై లైంగికదాడికి పాల్పడగా.. బట్టీ నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

2019.. ఎలిగేడు మండలం శివపల్లి పరిసరాల్లోని రైస్‌మిల్లులో వలస కూలీపై లైంగికదాడి జరిగింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

2023 ఏప్రిల్ 11న గౌరెడ్డిపేట వద్ద ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన ఆరుగురు కార్మికులు బట్టీల్లో తమను నిర్బంధించి పనులు చేయిస్తున్నట్లు వీడియో తీసి ఒడిశాకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థకు వాట్సాప్ చేశారు.

2023 ఏప్రిల్ 15న 9మంది రంగాపూర్‌లోని ఇటుకబట్టీ కార్మికులు, 16న 29మంది కార్మికులు తమను రక్షించాలంటూ వారివారి బంధువులకు తెలియజేయడంతో అక్కడి అధికార యంత్రాంగం స్పందించింది. మన రాష్ట్ర పోలీసింగ్ దృష్టికి తీసుకురావటంతో పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖల ఆధ్వర్యంలో వారిని నిర్బంధం నుంచి విడిపించి సొంత రాష్ట్రానికి రైలు ద్వారా తరలించారు. పొట్టకూటి కోసం.. భాషరాని ఊళ్లో పనిచేయటానికి వచ్చి ఇక్కడ పడుతున్న బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అక్కడివారికి చెప్పుకుంటున్నారు వలసకార్మికులు. తరచూగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

భరోసా కల్ల.. భద్రత డొల్ల..!

- పొట్టచేతపట్టుకుని వస్తున్న వలస కూలీలు
- ఇటుక, రైస్‌మిల్లులు, నిర్మాణ రంగంలో పనులు
- రెక్కలుముక్కలు చేసుకుంటున్నా తప్పని వేధింపులు
- ఫిర్యాదులు వచ్చినప్పుడే హడావుడి చేస్తున్న అధికారులు
- తరువాత పట్టించుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కార్మికులు



వలస కార్మికులు (ఫైల్)

సాక్షి పెద్దపల్లి: వలస కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. పనికి తగిన వేతనం అందటం.. పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువయ్యాయి. వలస జీవులకు ఏ అండా ఉండదనే ధీమాతో లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారు. కొన్ని సందర్భాల్లోనే కేసులు నమోదవుతుండగా.. చాలా సందర్భాల్లో పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కకుండానే వారి అమయాకత్వాన్ని ఆసరాగా చేసుకుని సెటిల్‌మెంట్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల భవననిర్మాణ పనులు చేయడానికి వచ్చిన ఓ బాలికపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసే ఇందుకు నిదర్శనమని పౌరహక్కుల సంఘాల నేతలు మండిపడుతున్నారు. బాలిక మరణించటంతో కేసు వెలుగులోకి వచ్చిందని, లేకపోతే విషయం బయటకు పొక్కకుండా దళారులు తొక్కిపెట్టేవారని విమర్శలున్నాయి.

కానరాని కార్మిక చట్టాలు..

జిల్లా పారిశ్రామిక రంగానికి ప్రసిద్ధి. అలాగే ఇటుక బట్టీలు, రైస్‌మిల్లులు అధికంగా ఉన్న ప్రాంతం. దీంతో ఇక్కడ పనిచేసేందుకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలు వలస వచ్చి ఇక్కడి ఇటుకబట్టీలు, రైస్ మిల్లులు, భవన నిర్మాణరంగాల్లో చిన్నచిన్న డేరాలు, గుడారాలు వేసుకుని కూలీలుగా పనిచేస్తున్నారు. ఇలా వచ్చిన కార్మిక కుటుంబాలకు కనీస వేతనాలు.. పనిగంటలు.. పనికి తగిన వేతనం, మెరుగైన వసతి, వైద్య సదుపాయం, కార్మికుల పిల్లలకు విద్యాబోధన, తదితర సౌకర్యాలను కల్పించాలని కార్మికచట్టాలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో ఇవేమీ కనిపించవు.. వినిపించవు. అక్కడ స్థానిక బట్టీల యజమానులు, రైస్‌మిల్లర్స్‌ల సొంత చట్టాలే రాజ్యమేలుతున్నాయి. దీంతో స్థానిక యంత్రాంగం వాటి వైపు చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్మిక శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 10వేల మంది వలస కార్మికులు ఉన్నారు. అందులో భవన నిర్మాణంలో ఆరువేలకు పైగా కూలీలు ఉండగా.. రైస్ మిల్లుల్లో 2500 మంది, ఇటుకబట్టీల్లో 1500 మంది దాకా పనిచేస్తున్నారు. దళారుల ద్వారా ఆయా యజమానులు ఆయా రాష్ట్రాల వలస కూలీలకు అడ్వాన్స్ చెల్లించి పనికి తీసుకొచ్చుకుంటారు. పైసల ఆశలతో ఇక్కడికి వచ్చిన

దళారుల ద్వారా వచ్చి వలలో చిక్కుకుని..

కార్మికులు ఇక్కడి వాతావరణంలో పనిచేయలేక.. పనిఒత్తిడి, లైంగిక వేధింపులు తాళలేక ఇబ్బంది పడుతున్నారు. కుటుంబాలతో సహా వచ్చిన కార్మికులకు కార్మిక చట్టాలు గురించి అవగాహన లేకపోవటంతో, ఇరుకైన చిన్నచిన్న గుడారాల్లో వారికి వసతి కల్పించటం, మహిళా కార్మికులను లైంగిక వేధింపులకు గురిచేయటం వంటి ఘటనలతో కార్మికుల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి వలసకార్మికుల వెతలపై ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాయపేట ‘ఎత్తిపోతల’ భేష్

- నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు



రైతులతో మాట్లాడుతున్న ఈఎన్‌సీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని లక్ష్మీపురం పరిధిలోని రాయపేట ఎత్తిపోతల పథకాన్ని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తక్కువ ఖర్చుతో చేపట్టిన ఈ ప్రాజెక్టుతో విస్తృత ప్రయోజనాలు లభిస్తున్నాయని తెలిపారు. హుస్సేన్‌మియా వాగు వృథా నీటిని ఒడిసి పట్టేందుకు గంగారం వద్ద చెక్‌డ్యాం నిర్మించామని, పైపులైన్ ద్వారా బొల్లగుట్టల వద్ద నిర్మించిన రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసి ఆ నీటిని మండలంలోని 18 గ్రామాలకు సాగునీరు అందించడం బాగుందని పేర్కొన్నారు. అనంతరం ఎస్సారెస్పీ ఉప కాలువ, డి–47ఎల్ ఉప కాలువను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సీ సత్యరాజ్ చంద్ర, ఈఈ ప్రసాద్, డీఈ బలరామయ్య, ఏఈ శ్రావణ్, రైతులు ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతు

ఓదెల: త్వరలోనే ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతు చేస్తామని ఈఎన్‌సీ తెలిపారు. మండలంలోని ఎస్సారెస్పీ డి–86, డి–83 కాలువలను పరిశీలించారు. కాలువలకు మరమ్మతు చేసి చివరి ఆయకట్టుకు నీరందిస్తామన్నారు. కాలువలు, షెట్టర్లు, మత్తడులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. మానేరులో నిర్మించిన చెక్‌డ్యాంలు, రూపునారాయణపేటలో ఇటీవల కొట్టుకుపోయిన చెక్‌డ్యాం గురించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

గ్రామాల్లో కేంద్రబృందం పర్యటన

ధర్మారం: మండలంలోని చామనపల్లి, కమ్మరిఖాన్‌పేట గ్రామాల్లో గురువారం స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటించింది. డీఎల్‌పీవో రాంబాబు, డీఆర్‌డీఓ శ్రీధర్, ఎంపీడీవో జయశీలతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, మరుగుదొడ్ల నిర్వాహణ, ఇంకుడుగుంతలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. సర్పంచులు, ఎంపీవో రమేశ్, ఏపీఎం తులసీమాత, ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో సునీల్‌కుమార్, కుమ్మరికుంటలో ప్రశాంత్ పర్యటించి గ్రామాల్లోని ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. తాగునీటి సౌకర్యంపై అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు, డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో సదానందం ఉన్నారు.

చిన్నకల్వలలో..

సుల్తానాబాద్‌రూరల్: మండలం చిన్నకల్వలలో సర్వే టీం సభ్యులు పర్యటించారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణను పరిశీలించారు. స్కూళ్లు, ఆసుపత్రులను తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకున్నారు. సర్పంచ్ రమేశ్‌గౌడ్, ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ఫయాజ్అలీ



సుల్తానాబాద్‌రూరల్: వివరాలు సేకరిస్తున్న టీం సభ్యులు

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్‌లో అధికారులు పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రార్థన మందిరాలను సందర్శించారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సక్రమంగా అందించాలి

సాక్షి, పెద్దపల్లి: ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాల్లోని అర్హులను గుర్తించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కలెక్టర్‌ను కోరారు. ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో తప్పులున్నాయని పేర్కొన్నారు. పాట్యాల, ముర్మూరు, ఎల్లంపల్లి, వేంనూర్ ముంపు గ్రామాలుగా ఉన్నాయని, 2015లో సీఎం కేసీఆర్ 18 ఏళ్లు నిండిన యువతకు 336 కూలీదినాల డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు చెల్లిస్తామని జాబితా కూడా తయారు చేశారని, అందులో అర్హులకు చోటు లభించలేదని ముంపు ప్రజలు అభ్యంతరం తెలుపడంతో నిలిపివేశారని పేర్కొన్నారు. ఇటీవల 1100 మందికి పైగా నిర్వాసిత కుటుంబాలకు రూ.22 కోట్లు విడుదల చేశారని తెలిపారు. గతంలో పాట్యాలలో 130, ముర్మూరు, ఎల్లంపల్లిలో 450 మంది, మద్దిర్యాలలో 79, వేంనూరులో 38మందితో జాబితా ఉండేదని, కాని తాజా జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఓ గ్రామంలో సర్పంచ్ కుటుంబంలో అదనంగా ఐదుగురిని చేర్పించారని, మరో రెండు గ్రామాల్లో స్థానికేతరులకు చోటు కల్పించారని పేర్కొన్నారు. అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పథకాలను మహిళలు వినియోగించుకోవాలి

కోల్‌సిటీ: ప్రభుత్వ పథకాలను మహిళాసంఘాలు వినియోగించుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం సమాఖ్య కమిటీ నిర్వహించిన మొదటి సమావేశానికి హాజరయ్యారు. టీహబ్, విహబ్‌తో ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలకు రెడీమేడ్ గార్మెంట్స్ తయారీలో శిక్షణ ఇప్పిస్తున్నామని, వారికి కుట్టుమిషన్లు అందిస్తామని పేర్కొన్నారు. తెలిపారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

తాజుద్దీన్ బాబాకు ప్రార్థనలు

జ్యోతినగర్: ఎమ్మెల్యే చందర్ గురువారం తాజుద్దీన్ బాబాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 23వ డివిజన్‌లోని దర్గాను దర్శించుకున్నారు. అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ ఉన్నారు.

టాటా మ్యాజిక్ డ్రైవర్లకు అండగా ఉంటా

గోదావరిఖని: టాటా మ్యాజిక్ డ్రైవర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే చందర్ అన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలవగా.. డ్రైవర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ముందుగా మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణను పరామర్శించారు. కొంకటి తల్లి ఇటీవల చనిపోగా.. విఠల్ నగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు.

19న ఓటరు అవగాహన ర్యాలీ





సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు

- ‘ఐ ఓట్ ఫర్ ష్యూర్’ నినాదంతో 5కే రన్
- బల్దియా కార్యాలయం నుంచి స్టేడియం వరకు ర్యాలీ
- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించేందుకు ఈనెల 19న 5కే రన్ నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ తెలిపారు. ఓటరు అవగాహన ర్యాలీపై సంబంధిత అధికారులతో కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గకేంద్రాల్లో ఉదయం 6 గంటలకు ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదంతో రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం నుంచి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వరకు ర్యాలీ ఉంటుందని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, పాలకుర్తి, అంతర్గాం తహసీల్దార్ జ్యోతి, విజయ్, సీఐలు ప్రమోద్‌రావు, పీఈటీలు పాల్గొన్నారు.

20లోగా గృహలక్ష్మి దరఖాస్తులు పరిశీలించాలి

సుల్తానాబాద్‌రూరల్: ఈనెల 20లోగా గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులకు సూచించారు. మండలంలోని గర్రెపల్లిలో పర్యటించారు. గ్రామంలో 197 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు 98 దరఖాస్తులను పరిశీలించారని, పథకం కింద అర్హులకు ఇళ్లు అందేలా ఎంపిక ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, గిర్దవార్ తదితరులున్నారు.

సహకార సంఘాన్ని నంబర్ వన్ చేస్తాం



మాట్లాడుతున్న శ్రీనివాస్

- త్వరలో డిజిటల్ సేవకేంద్రం ప్రారంభం
- కేడీసీసీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సింగిల్‌విండోను రాష్ట్రంలోనే నంబర్‌వన్ చేస్తామని, ఆ దిశగా పాలకవర్గం, అధికారులు పనిచేస్తున్నారని కేడీసీసీ జిల్లా డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో పాలకవర్గంతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ 2018లో తీసుకున్న రుణాల్లో మొదటి విడత రూ.25వేల లోపు ఉన్న 126మంది రైతులకు రూ.20,62,121 మాఫీ అయ్యాయని, రెండో విడత రూ.50వేల లోపు ఉన్న 230మంది రైతులకు రూ.80,72,279, మూడో విడత 369 మంది రైతులకు రూ.2.24కోట్లు, రూ.లక్ష రుణమాఫీ కింద 207 మరో 220మంది అర్హులుగా ఉన్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్, కేడీసీసీ బ్యాంకు జీఎంకు వినతిపత్రం ఇస్తామన్నారు. రైతులు, ప్రజల సౌకర్యార్థం 300పైగా సేవలు అందించేలా డిజిటల్ సేవ కేంద్రాన్ని చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేతులమీదుగా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 2022– 23లో సంఘానికి రూ.44.88లక్షల నికర లాభం వచ్చిందని ఆడిట్ అధికారి సురేందర్ రెడ్డి నివేదిక సమర్పించారు. సభ్యత్వం కావాలనుకునే రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పీఏసీఎస్ కార్యదర్శి బూర్గు సంతోష్ కుమార్, డైరెక్టర్లు పన్నాల రామన్న, బండ గోపయ్య, కూకట్ల ఓదెలు, ముద్దసాని సురేశ్ రెడ్డి, సుగుణాకర్, లచ్చయ్య, రాజయ్య, పోచమ్మ, పద్మ ఉన్నారు.

కర్ణాటక తరహాలో క్లస్టర్లు



మంథని: ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కర్ణాటక తరహాలో మూడు వేలకో క్లస్టర్ ఏర్పాటు చేస్తామని మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం మంథనిలో క్లస్టర్ కమిటీ సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనంపై సంబరాలు



గోదావరిఖనిటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై కార్మికులు సంబరాలు చేసుకున్నారు. గోదావరిఖని బస్ డిపోలో కేసీఆర్ ఆకారం రూపంలో బస్సులను నిలిపి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగభూషణం, ఆర్టీసీ సిబ్బంది రామయ్య, రామన్న, చంద్ర మల్లేష్, భాను, ప్రశాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు కరీంనగర్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

పెద్దపల్లిరూరల్: మాల్టా దేశంలో నిర్మాణ రంగంలో పనిచేసేందుకు ఆసక్తిగలవారి కోసం ఈనెల 19న కరీంనగర్‌లో ఇన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకున్న వారిలో నైపుణ్యం కలిగిన వారికి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మాల్టాలోని నిర్మాణ రంగంలో సివిల్ ఫోర్‌మెన్, షట్టరింగ్ కార్పెంటర్, కాంక్రీట్ మేసన్, స్టీల్ ఫిక్సర్, ప్యానెల్ బీటర్, స్ప్రేయర్‌గా పని చేసేందుకు కరీంనగర్‌లోని కమాన్ వద్ద గల (యూనియన్ బ్యాంక్ పైన) డాటా ప్రో పీఎంకేకే సెంటర్‌లో హాజరుకావాలని సూచించారు. టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పబ్లిక్ పార్కులో స్థల పరిశీలన



పార్కులో పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి: మండల కేంద్రంలోని సెంటినరీకాలనీ పబ్లిక్ పార్కులో నూతనంగా స్టేజీ, మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఎస్‌వోటూ జీఎం రఘుపతి గురువారం స్థలాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ డీజీఎం వద్ది రాజు, డీవైపీఎంలు కె.మారుతి, జె.శ్రీహరి, టీబీజీకేఎస్ ఆర్జీ–3 వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, సివిల్ డీవైఎస్ఈ రామకృష్ణ, సూపర్‌వైజర్ యాకుబ్ పాషా తదితరులున్నారు.

ఇంటర్‌లో ఖాళీ సీట్లకు రేపు ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 19న ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా సమన్వయాధికారి మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ రీజియన్‌లోని పెద్దపల్లి జిల్లాలోని మల్లాపూర్, గర్రెపల్లి, రామగుండం, నందిమేడారం విద్యాలయాల్లో బాలికలకు, మంథని, పెద్దపల్లిలోని విద్యాలయాల్లో బాలురకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గలవారు శనివారం ఆయా విద్యాలయాలకు వెళ్లి, ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

ఆయన నేత్రాలు సజీవం



రాజమౌళి (ఫైల్)

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముస్త్యాల రాజమౌళి(99) బుధవారం అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. తీవ్ర విషాదంలోనూ కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నూక రమేశ్, చందు, నమ్మయ్య టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా గురువారం నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. రాజమౌళి భార్య ప్రమీల, కుమారులను సర్పంచు గంట పద్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణారెడ్డి అభినందించారు.

ఆశలన్నీ గృహలక్ష్మి పైనే..!

- నియోజకవర్గానికి మూడు వేల మంది లబ్ధిదారుల ఎంపిక
- ధర్మపురిలోని ధర్మారం మండలానికి 975
- మంథని నియోజకవర్గానికి 1500 కేటాయింపు
- దరఖాస్తులపై ఈ నెల 20లోపు సర్వే పూర్తి



సుల్తానాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: నిరుపేదలకు సొంత గూడు ఉండాలన్న సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టి.. గ్రామం మొదలు పట్టణాల్లోని అర్హుల నుంచి ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. వాటిని పరిశీలించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టి.. ఈనెల 20 వరకు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు అర్హుల వివరాలు సేకరిస్తున్నారు. ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుండడంతో ప్రజలు గృహలక్ష్మిపై ఆశలు పెంచుకుంటున్నారు.

సొంత స్థలం ఉంటేనే..

మహిళల పేరిట సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క పెద్దపల్లి నుంచే 15వేల వరకు దరఖాస్తులు అందాయి. మంథని నుంచి 7,950, రామగుండం నుంచి 7,402 అర్జీలు వచ్చాయి. వీరిలో గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఎంపికైన వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే డబుల్ ఇళ్ల పంపిణీ ఆలస్యం కావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్నారు. అర్హులను గుర్తించేందుకు జిల్లాలో సర్వే ప్రారంభించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 20 లోపు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హుల పేర్లను ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు.

అర్హతలివే..

- ఆహారభద్రత (తెల్లరేషన్) కార్డు కలిగి ఉండి అందులో దరఖాస్తుదారు పేరుండాలి.
- మహిళా పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- కులం, ఆదాయం సర్టిఫికెట్ లేకుంటే విచారణకు వచ్చిన అధికారులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించి, జిరాక్స్ ప్రతులు అందించాల్సి ఉంటుంది.
- గతంలో వర్షాలకు ఇల్లు కోల్పోయినవారికి ప్రాధాన్యత ఇస్తారని అధికారులు అంటున్నారు.
- దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50శాతం , జనరల్ 15 శాతం చొప్పున ఇళ్లను కేటాయిస్తారు.
- కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండరాదు.
- ఇదివరకు ప్రభుత్వం నుంచి ఇల్లు పొందినా.. దళితబంధు, ఇతర పథకాలు లబ్ధిపొందితే వారి దరఖాస్తులు తిరస్కరిస్తారు.
- మంజూరు పత్రాలు అందిన తర్వాత ఇంటి నిర్మాణం ప్రారంభించాలి.
- బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష, రూఫ్ లెవల్ రూ.లక్ష, పూర్తయిన తర్వాత రూ.లక్ష చొప్పున అందిస్తారు.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసి సెప్టెంబర్ మొదటివారంలో జాబితా ప్రకటించే అవకాశం ఉండడంతో ప్రజలు సర్పంచ్ మొదలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. చోటామోటా నాయకులతో మాట్లాడుతున్నారు.

నిరుపేదలకు న్యాయం చేయాలి



నిజమైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం ద్వారా న్యాయం చేయాలి. పైరవీలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఇళ్లు కేటాయించాలి.– మినుపాల స్వరూపరాణి, జెడ్పీటీసీ, సుల్తానాబాద్

సర్వే ప్రారంభించాం



అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో సర్వే ప్రారంభించాం. అర్హులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. సొంతం స్థలం ఉన్న నిరుపేదలను గుర్తించి న్యాయం చేస్తాం. – మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్, సుల్తానాబాద్

సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచనే లేదు

- ప్రధాని మోదీనే స్వయంగా చెప్పారు
- బీఆర్ఎస్ నేతలది అసత్య ప్రచారం
- మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

గోదావరిఖని: సింగరేణిని ప్రైవేటీకరణ ఆలోచనే ప్రధాని మోదీకి లేదని, ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో జరిగిన బహిరంగ సభలో ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెప్పడాన్ని మరచిపోవద్దని మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. గురువారం జీడీకే–11ఎ గనిపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో దొడ్డిదారిన గెలవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంస్థలో కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతమేనని, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా ప్రైవేటీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కల్వకుర్ల మైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వేలం పాట ద్వారా దక్కించుకోకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం నిజం కాదా అని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రధాని మోదీ ఒక్క రూపాయి తీసుకోకుండా కరోనా టీకాలను అందించిన విషయం మరిచిపోవద్దని కోరారు. వెంకటస్వామి ఎంపీగా ఉన్న సమయంలో కార్మికులకు సింగరేణి స్థలంలో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు, రిటైర్ అయిన తర్వాత పింఛన్ ఇప్పించారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో చివరిసారి పోటీ చేయాలనుకుంటున్నానని, తనను గెలిపించాలని సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ పి.మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.



అర్జీలు తీసుకుంటున్న సీఐ శ్రీనివాస్



మద్యం షాపుల లిస్ట్ చూపిస్తున్న సిబ్బంది



ఫాం నింపుతున్న దరఖాస్తుదారులు

రండి రండి.. టెండర్ వేయండి

రండి సార్.. రండి.. టెండర్ వేయండి.. మీ లక్కును పరీక్షించుకోండి.. రేపే ఆఖరి రోజు.. అంటూ అబ్కారీ పోలీసులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. పెద్దపల్లి ఐటీఐ కళాశాల ఆవరణలోని సెంటర్‌కు వచ్చిన దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేస్తూ మద్యం పాలసీ విధివిధానాలను బడిపిల్లలకు పాఠాలు బోధిస్తున్నట్లు స్పష్టంగా తెలుపుతూ మద్యం టెండర్లకు ఆహ్వానించారు. జిల్లాలోని 77 మద్యం షాపులకు గురువారం సాయంత్రం వరకు 650కి పైగా దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం ఆఖరి రోజు కావడంతో పెద్ద మొత్తంలో అర్జీలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రైతుకు పాముకాటు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చందర్

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లికి చెందిన గర్రెపల్లి సురేందర్ గురువారం ఉదయం పొలం వద్ద పనులు చేస్తుండగా ఆయన కాలుపై పాము కాటు వేసిందని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దవాఖానాకు వెళ్లి, బాధితుడిని పరామర్శించారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, వల్లె శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన ఉట్కూరి రమేశ్(32) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రమేశ్‌కు భార్య లత, నాలుగేళ్ల పాప ఉన్నారు. అతను కూలి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, నిత్యం తాగి ఇంటికి వచ్చేవాడు. బుధవారం రాత్రి కూడా అలాగే రావడంతో మద్యం ఎందుకు తాగుతున్నావని భార్య మందలించింది. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం

గోదావరిఖని: సింగరేణి సంస్థలో చనిపోయిన, మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల్లో భాగంగా 8 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ గురువారం అందజేశారు. వారసత్వంగా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గైర్హాజరు లేకుండా క్రమశిక్షణతో సీనియర్ ఉద్యోగుల సూచనలు, అధికారుల ఆదేశాల మేరకు రక్షణతో పని చేయాలని సూచించారు. ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష చూపుతున్నారని కార్మికుడి నిరసన



రామగిరి: 30 ఏళ్లగా కార్మికుడిగా పని చేస్తున్న తనపై సింగరేణి అధికారులు వివక్ష చూపుతున్నారని, డైరెక్టర్(పా) పట్టించుకోవాలంటూ ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ఎండీ.జాని గురువారం నిరసన తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం.. ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ.జాని కింది క్వార్టర్ కావాలని నాలుగేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 2011లో అతను రోడ్డు ప్రమాదంలో గాయపడి, చాలా ఇబ్బందులు పడుతున్నాడు. తన తర్వాత ఉద్యోగాల్లో చేరిన కార్మికులకు కింది క్వార్టర్లు ఇస్తూ తనపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. జీఎం కార్యాలయంలో పైరవీలకే ప్రాధాన్యం ఇస్తూ.. తన లాంటి సీనియర్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కింది క్వార్టర్ కేటాయించాలనిఆయన కోరాడు.

బొగ్గుబాయి వార్తలు

రెస్క్యూ పోటీల ఏర్పాట్లు పరిశీలన



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్‌తో కలిసి గురువారం జీడీకే–7 ఎల్‌ఈపీ గనిని సందర్శించారు. భూగర్భ గనిలో నిర్వహించనున్న మైన్స్ రెస్క్యూ పోటీలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. డీజీఎంఎస్ అధికారులు, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్‌లో జోనల్, నవంబర్‌లో ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి ఆతిథ్యమిస్తున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 28 కోల్, మెటల్ గనుల నుంచి జట్లు పాల్గొంటాయని అన్నారు. జీఎం రెస్క్యూ వెంకటేశ్వర్లు, వకీల్‌పల్లె గ్రూప్ ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, నితేశ్ మహేంద్ర పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించండి

- భూగర్భ గనుల జీఎం రఘురాం రెడ్డి



జీఎంను సన్మానిస్తున్న అధికారులు

రామగిరి: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని భూగర్భ గనుల జీఎం వై.రఘురాం రెడ్డి అన్నారు. గురువారం ఏపీఏలో పర్యటించారు. మొదటిసారి జీఎం కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. గనిలో చేపడుతున్న పనులు, నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు, యంత్రాల వినియోగం, రక్షణ తదితర అంశాలపై చర్చించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం డి.వైద్య, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, అధికారులు చక్రవర్తి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్టు వైద్యులను నియమించాలి



డైరెక్టర్(పా)కు వినతిపత్రం ఇస్తున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులను నియమించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం గోదావరిఖని సింగరేణి ఆస్పత్రిలో మదర్ అండ్ చైల్డ్ కేర్ ప్రారంభానికి వచ్చిన సంస్థ డైరెక్టర్(పా) బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గోదావరిఖని ఏరియా ఆస్పత్రితోపాటు ప్రధాన ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు లేరని, ఆర్థో, కార్డియాలజీ, డెలివరీ కేసుల్లో ఎంబీబీఎస్ వైద్యులే చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఆర్జీ–1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్కే.గౌస్, సహాయ కార్యదర్శి మల్యాల శ్యామల, ఆర్జీ–2 అధ్యక్షుడు ఎస్.వెంకన్న పాల్గొన్నారు.

జనక్ ప్రసాద్‌కు అవకాశం ఇవ్వండి

యైటింక్లయిన్‌కాలనీ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్‌కు అవకాశం ఇవ్వాలని సంఘం సెంట్రల్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి కోరారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి, ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు లెటర్ రాసినట్లు పేర్కొన్నారు. గురువారం యైటింక్లయిన్‌కాలనీలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక క్షేత్రమైన రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి ఐఎన్‌టీయూసీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. జనక్ ప్రసాద్‌కు ఇక్కడి కార్మికులతో మంచి అనుబంధం ఉందని, వారి హక్కుల సాధనలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సెంట్రల్ జనరల్ సెక్రటరీ లక్ష్మీపతి గౌడ్, జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి దాస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం సంస్థ డైరెక్టర్(పా) బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుల నివాస గృహాల మధ్య అంతర్గత రోడ్లు, రామగుండం మున్సిపల్ కార్యాలయం నుంచి 5 ఇంక్లైన్ మోరి వరకు ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. పారిశుధ్య విభాగం ప్రైవేట్ కాంట్రాక్టర్లు సరిగా పని చేయడం లేదని, క్వార్టర్లలో నివాసముంటున్న కుటుంబాల వారు అనారోగ్యానికి గురవడానికి కారణం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటమేనని తెలిపారు. నీటిని క్లోరినేషన్ చేసి, అందించాలని, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం తొలగించాలని, క్వార్టర్లకు మరమ్మతు చేయించాలని విన్నవించారు. డెల్టా సెక్యూరిటీ కంపెనీకి చెందిన 43 మంది సెక్యూరిటీగార్డులను అక్రమంగా తొలగించారని అన్నారు. సన్ సెక్యూరిటీ పేరుతో కొత్తగా 43 మందిని భారీ మొత్తంలో డబ్బులకు తీసుకున్నారని ఆరోపించారు. పాత సెక్యూరిటీ గార్డులనే కొనసాగించాలని కోరారు.

గుర్తింపు పత్రాలు ఏరియా ఆస్పత్రిలోనే ఇవ్వాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు గుర్తింపు పత్రాలను వారి ఎంప్లాయ్ కోడ్ ద్వారా ఏరియా ఆస్పత్రిలోనే ఇవ్వాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఉపాధ్యక్షుడు ఆకుల హరీశ్, కార్యదర్శి సాయవేణి సతీశ్ కోరారు. ఈ మేరకు గురువారం సింగరేణి డైరెక్టర్(పా) బలరాం నాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్మికులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, మంచిర్యాల తదితర ప్రాంతాలకు పంపించినప్పుడు గుర్తింపు పత్రాలు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏరియా ఆస్పత్రిలోనే అందించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోదావరిఖనిటౌన్: ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 99592 25922నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

కార్మికులకు లాభాల వాటా చెల్లించండి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న విశ్వనాథ్

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ఏరియర్స్‌తోపాటు లాభాల వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–1లోని జీడీకే–1, 2 ఇంక్లైన్‌లో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. అనంతరం 2ఏ గని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. సీఎం కేసీఆర్ మంచిర్యాల బహిరంగ సభలో ప్రకటించినట్లు కార్మికులకు రూ.700 కోట్లలో 35 శాతం వాటా చెల్లించాలని, 190/240 మస్టర్లు నిండిన వారికి జనరల్ మజ్దూర్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. మైనింగ్ స్టాఫ్, టెక్నీషియన్లు, ఈపీ ఆపరేటర్లకు మెడికల్ అన్‌ఫిట్ ఫిట్ అయితే సూటేబుల్ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘాని(ఐఎఫ్‌టీయూ)కి సేఫ్టీ, మైన్స్ కమిటీలతోపాటు సింగరేణి అధికారిక కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రీజియన్ కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సెక్యూరిటీగార్డులపై పెనాల్టీ మానుకోవాలి

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఆకుల వెంకన్న, సెక్యూరిటీగార్డులు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదన్నారు. విధులకు హాజరు కాకపోతే పెనాల్టీ విధించడం మానుకోవాలని, పని స్థలాల్లో షెల్టర్, రాత్రి పూట ఇబ్బందులు లేకుండా లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు వృత్తి పన్ను రికవరీ నిలుపుదల చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రమేశ్, సంజీవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.